క్లుప్తంగా

పంచారామ క్షేత్ర ఈఓకు అదనపు బాధ్యతలు



ఎంఎస్ఎన్ చారిటీస్ బాధ్యతలు స్వీకరించిన ఈఓ నీలకంఠంను అభినందిస్తున్న విజయలక్ష్మి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్ర ఈఓ బళ్ల నీలకంఠం గురువారం కాకినాడ జగన్నాథపురంలోని మల్లాడి సత్యలింగం నాయకర్ (ఎంఎస్ఎన్ చారిటీస్) ఇన్‌చార్జి కరస్పాండెంట్‌గా బాధ్యతలు స్వీకరించారు. దేవదాయశాఖ కమిషనర్ నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు ఇప్పటి వరకూ ఇన్‌చార్జిగా ఉన్న పెద్దాపురం మరిడమ్మ దేవస్థానం, అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు విజయలక్ష్మి బళ్ల నీలకంఠంను అభినందించారు.

ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌కు సత్కారం



ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గోకిన సునేత్రాదేవిని సత్కరిస్తున్న కౌన్సిలర్లు

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని సమర్థవంతంగా నిర్వహించిన ఇన్‌చార్జి చైర్‌పర్సన్ గోకిన సునేత్రాదేవిని సభ్యులు ఘనంగా సత్కరించారు. వైఎస్సార్ సీపీకి చెందిన చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణపై సొంత పార్టీ సభ్యులు అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టడం, ఆమె కోర్టును ఆశ్రయించడంతో రెండు నెలలుగా కౌన్సిల్ సమావేశాలు జరగలేదు. ఇటీవల చైర్‌పర్సన్ అరుణ తాను విదేశాలకు వెళుతున్నట్లు మున్సిపల్ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడంతో సీడీఎంఏ నుంచి వైస్ చైర్మన్ గోకిన సునేత్రాదేవిని ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు వచ్చిన విషయం విదితమే. దాంతో ఆమె ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించడంతో ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, వైఎస్సార్ సీపీ, టీడీపీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు నేడు అంతరాయం

సామర్లకోట: మాధవపట్నం గ్రామంలోని విద్యుత్తు సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం ఆ సబ్ స్టేషన్ నుంచి విద్యుత్తు సరఫరా అవుతున్న గ్రామాలకు శుక్రవారం విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఏవీఎన్‌డీఎస్ ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు వీకే రాయపురం, కొత్తూరు, సత్యవరపుపేట, బోయనపూడి, ఉండూరు, మామిళ్లదొడ్డి, మాధవపట్నం గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

మాజీ కౌన్సిలర్ మృతి



మాసా గ్రేస్ (ఫైల్)

సామర్లకోట: స్థానిక మున్సిపల్ కౌన్సిలర్‌గా 1982–1987 వరకూ పని చేసిన మాజీ కౌన్సిలర్ మాసా గ్రేస్ గురువారం తెల్లవారుజామున మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బ్రౌన్‌పేటలోని ఆమె ఇంటి వద్ద మరణించారు. ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

సామర్లకోట: పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని, 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సీఐ కె.రామ్మోహనరావు కథనం ప్రకారం.. గురువారం స్థానిక కుమ్మర వీధిలో పది లీటర్ల సారాతో గుబ్బల నాగరాజును అదుపులోకి తీసుకున్నారు. భాస్కర్‌నగర్‌లోని క్వారీ గోతులలో నాటు సారా తయారు చేయడానికి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ మేరకు 20 లీటర్ల సారాతో జిత్తుగ అనిల్ కుమార్‌ను పట్టుకుని, కాకినాడ ఎక్సైజ్ కోర్టులో హాజరు పర్చగా రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సైలు ఎంవీవీబీ కుమార్, బీఎస్ఎన్ వరహాలు, సిబ్బంది ఉన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

పెద్దాపురం: స్థానిక మున్సిపల్ సెంటర్ అంబేడ్కర్ భవన్‌లో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు పెద్దాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో ఆయన మాట్లాడుతూ తన జన్మదినం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కిరణ్ కంటి ఆసుపత్రి సారథ్యంలో నిర్వహించే ఈ వైద్య శిబిరంలో ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారన్నారు. పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సాయి ప్రసాద్ కోరారు.

వరలక్ష్మీ వత్రాలకు వేళాయె..

- నేడు శ్రావణ శుక్రవారం వ్రతాలు
- దాతలు, దేవస్థానం సహకారంతో పూజా సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు
- సుమారు 500 మంది భక్తులు వచ్చే అవకాశం



సామర్లకోట పంచారామ క్షేత్రంలో మామిడి తోరణాలు కడుతున్న సిబ్బంది

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన శ్రీబాలా త్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ మాసంలో వచ్చే శుక్రవారాల్లో వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఈ శ్రావణ మాసంలో ఐదు శుక్రవారాలు రావడంతో రెండు శుక్రవారాల్లో సామూహిక వ్రతాలు నిర్వహించాలని దేవదాయ శాఖ అధికారులు నిర్ణయించారు. మూడో శుక్రవారం వరలక్ష్మీ వ్రతాలను మహిళలు ఇళ్ల వద్ద ఎక్కువగా చేసుకునే అవకాశం ఉండటంతో ఆ వారం ఆలయంలో ఏర్పాట్లు చేయడం లేదని దేవస్థాన అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా ఆగస్టు 1, 15వ తేదీల్లో వచ్చే శుక్రవారాల్లో సామూహిక వ్రతాలను నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రావణ మాసం శుక్రవారంతో ప్రారంభం కావడంతో అంతకు ముందు బుధవారం ఆలయంలో అమ్మవారికి శాకంబరి అలంకరణ, అమ్మవారికి సారె, చీర ఏర్పాట్లతో పాటు లక్ష పసుపు కొమ్ముల నోము పూజలు నిర్వహించారు. దాని కారణంగా మొదటి శుక్రవారం దేవస్థానం నిర్వహించలేదు. ఇక ఐదో శుక్రవారం అమావాస్య రోజు రావడంతో ఆ రోజు కూడా సామూహిక పూజలు చేయడం లేదని దేవస్థాన అధికారులు తెలిపారు. రెండో శుక్రవారం ప్రారంభం అయ్యే పూజలకు సంబంధించి ఆలయాన్ని మామిడి తోరణాలతో భక్తులకు స్వాగతం పలికే విధంగా ఏర్పాట్లు పూర్తి చేశారు.

దేవస్థానంలో జరిగే సామూహిక వ్రతాలతో మంచి ఫలితాలు వస్తాయని పండితుల సూచనల మేరకు సామూహిక వ్రతాలకు ఎక్కువగా భక్తులు హాజరవుతున్నారు. ఈ మేరకు వ్రతాల్లో పాల్గొనే భక్తుల వ్రతాలకు కావాల్సిన తోరాలు, రూపులు, ఆకులు, చెక్కలు, కొబ్బరి కాయలు, అరటి పండ్లు, గాజులు, ప్లేట్లు, పువ్వులు, లక్ష్మీదేవి ఫోటో, ప్రసాదం దాతలు, దేవస్థానం నుంచి ఏర్పాట్లు చేశారు. వరలక్ష్మీ వ్రతాలకు వచ్చే మహిళలు కేజీన్నర బియ్యం, పంచపాత్ర, కలశ చెంబు, బ్లౌజ్ మాత్రమే తీసుకు రావాల్సి ఉంటుందన్నారు. వ్రతాలు నిర్వహించే పురోహితులకు దేవస్థానం నుంచి రుసుం చెల్లించడం జరుగుతుందని వారు తెలిపారు. సామూహిక వ్రతాల్లో తమ పేర్లు నమోదు చేయించుకున్న మహిళలు శుక్రవారం ఉదయం 9 గంటలకు ఆలయంలో నిర్వహించే వ్రతాలకు హాజరు కావాల్సి ఉంటుంది. పూజల్లో పాల్గొనే భక్తులకు శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. సుమారు 500 మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని దేవస్థాన అధికారులు అంచనా వేస్తున్నారు.

మంచి ఫలితం ఉంటుందనే..



ఇళ్ల వద్ద చేసుకునే వ్రతాల కంటే దేవస్థానంలో చేసుకునే సామూహిక వ్రతాల్లో పాల్గొనడం ద్వారా 100 రెట్లు ఫలితాలు ఉంటాయనే ప్రచారం ఉంది. ఈ విషయాన్ని అనేక మంది ఆధ్యాత్మిక వేత్తలు, వేద పండితులు తెలియజేస్తున్నారు. పూజైన తరువాత ముత్తైదువులకు తాంబూలాలు ఇవ్వాలి. సామూహిక వ్రతాల్లో ఎక్కువ మంది ముత్తైదువులను చూసే అవకాశం ఉంటుంది. దేవాలయంలో వేదపండితులు చేసే సహస్రనామ పారాయణతో మంచి ఫలితం వస్తుందనే నమ్మకం ఉంది.

– శ్రీరంగం మాధవి, గృహిణి, పెద్దాపురం

ఏర్పాట్లు పూర్తి



సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయం మొదటి అంతస్తులో భక్తులు నిండిపోతే, దిగువ భాగంలో భక్తులకు ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి భక్తురాలికి వేదపండితుల మంత్రాలు వినిపించే విధంగా చర్యలు తీసుకున్నాం. భక్తులు విఘ్నేశ్వర పూజకు బియ్యం, ఉద్ధరిణి, కలశ చెంబు, జాకెట్ ముక్క మాత్రమే తీసుకు రావాలి. మిగిలిన పూజా సామగ్రి దేవస్థానం, దాతల సహకారంతో ఏర్పాటు చేశాం. వ్రతాల్లో పాల్గొనే భక్తులు ఉదయం 9 గంటలకు తప్పనిసరిగా హాజరుకావాలి.

– బళ్ల నీలకంఠం, పంచారామ క్షేత్రం ఈఓ, సామర్లకోట

తండ్రి చెంతకు తప్పిపోయిన బాలుడు



తప్పిపోయిన బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న ట్రాఫిక్ ఎస్సై గరగారావు

సామర్లకోట: తప్పిపోయిన ఓ బాలుడిని ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు తండ్రి చెంతకు చేర్చారు. భీమవరానికి చెందిన బొత్స రామాంజనేయులు కుటుంబ సభ్యులతో దువ్వాడలో కూలి పనికి వెళ్తున్నాడు. ఈ నేపథ్యంలో సామర్లకోట రైల్వే స్టేషన్‌లో తన కుమారుడు రాము, భార్యతో కలసి శుక్రవారం మధ్యాహ్నం దిగాడు. సామర్లకోట నుంచి దువ్వాడకు రాయగడ పాసింజర్‌కు వెళ్లాల్సి ఉంది. ఈ క్రమంలో రామాంజనేయులు వద్ద ఉన్న తన కుమారుడు రాము (7) తప్పిపోయాడు. రైల్వే స్టేషన్ సెంటర్‌లో అంతా గాలించినా ప్రయోజనం లేకపోవడంతో బస్సు కాంప్లెక్స్ వద్ద ఉన్న అవుట్ పోస్టు పోలీస్ స్టేషన్‌లో ట్రాఫిక్ ఎస్సైను ఆశ్రయించారు. దాంతో ఎస్సై గరగారావు సీసీ కెమెరాలను పరిశీలించి బొత్స రామును గుర్తించారు. వెంటనే ట్రాఫిక్ సిబ్బంది సహాయంతో బాలుడిని తీసుకువచ్చి తండ్రి రామాంజనేయులుకు అప్పగించారు.

హామీల మాటేంటో చెప్పండి బాబూ!



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత



హాజరైన పార్టీ శ్రేణులు

- అన్నీ నెరవేర్చే వరకూ ఉద్యమిస్తాం
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత

పిఠాపురం: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీల మాటేంటో చంద్రబాబు చెప్పాలని, బాండులో రాసిచ్చిన హామీలు నెరవేర్చే వరకూ ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ ఉద్యమిస్తుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత అన్నారు. ఎన్నికల్లో ఎన్నో హామీలు ఇచ్చి వాటిని అమలు చేస్తామంటూ బాండు రాసిచ్చారని, తీరా అధికారంలోకి వచ్చాక ఏఒక్క హామీని నెరవేర్చడం లేదని, మీరిచ్చిన బాండు మాటేమిటి బాబూ అంటూ ఆమె ప్రభుత్వ తీరును దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ గొల్లప్రోలు మండల అధ్యక్షుడు అరిగెల రామయ్యదొర అధ్యక్షతన గురువారం గొల్లప్రోలు మండలం చేబ్రోలులో నిర్వహించిన గొల్లప్రోలు మండల వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశంలో ఆమె ప్రసంగించారు. బాండు ఇవ్వడమంటే పూర్తి ఆధారంతో అమలు చేస్తామంటూ హామీ ఇవ్వడమేనని, అలాంటి బాండు ఇచ్చి కూటమి నేతలు ప్రజలను నిలువునా ముంచారన్నారు. ముఖ్యంగా రైతులను నిలువునా మోసం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 14 నెలలు అవుతున్నా ఇప్పటికీ మేనిఫెస్టోలో ఇచ్చిన పథకాలను అమలు చేయలేదన్నారు. పోరాటం చేయగా ఇప్పటికి ఒక్క తల్లికి వందనం మాత్రం ఇచ్చారని, అది కూడా కొందరికే ఇచ్చి చేతులు దులుపుకొన్నారని ఆమె విమర్శించారు. రెండేళ్లుగా రైతు భరోసా ఇవ్వలేదన్నారు. చివరకు కేంద్రం ఇచ్చే వాటా కూడా ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచారని ఆమె విమర్శించారు. పార్టీ తరఫున పోరాటం చేస్తే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. కాని కొన్న ధాన్యానికి ఇప్పటికీ చాలా మంది రైతులకు డబ్బులు వేయకుండా ఇబ్బంది పెడుతున్నారన్నారు. రాబోయే రోజుల్లో తీవ్ర ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని నాయకులంతా సహకరించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. సుమారు నెల రోజుల పాటు రాష్ట్రం, జిల్లా, నియోజకవర్గాల్లో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం చేస్తే తల్లికి వందనం వేశారని, అది కూడా కొంతమందికేనని అన్నారు. ముఖ్యంగా మహిళలను అన్ని విధాలా ఆదుకుని వారు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసిన ఘనత ఒక్క వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కుతుందన్నారు. అలాంటి పథకాలన్నింటినీ కూటమి ప్రభుత్వం నిలుపుదల చేసిందన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ గత ఏడాది కూడా వేయలేదని, ఈ ఏడాది వేస్తామంటూ నెలల తరబడి వాయిదాలు వేస్తున్నారన్నారు. ఎప్పుడు వేస్తారో కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొందన్నారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలు చేశారన్నారు. వాటిని కూటమి ప్రభుత్వం తొలగించిందని అన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా, ఎంత భయపెట్టినా, కేసులు పెట్టినా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ప్రజల తరఫున పోరాటం చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, జెడ్పీటీసీ ఉలవకాయల నాగ లోవరాజు, కడింశెట్టి భాస్కరరెడ్డి, దాసం వెంకటేష్, వైస్ ఎంపీపీలు నేమాని ఆదివిష్ణు, బత్తిన మంగ, గొల్లపల్లి నానాజీ, పుప్పాల బాబులు, ఖండవల్లి జ్యోతి తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల వారసత్వాన్ని నిలబెట్టాలి



సుబ్బారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సూరిబాబు తదితరులు

పెద్దాపురం: కమ్యూనిస్టుల వారసత్వాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత ప్రతి విప్లవకారుడిపై ఉందని సీపీఎం నాయకుడు నీలపాల సూరిబాబు అన్నారు. 1955 నుంచి 1960 వరకూ పెద్దాపురం నియోజకవర్గం నుంచి కమ్యూనిస్ట్ పార్టీ ఎమ్మెల్యేగా పనిచేసిన దుర్వాసుల వెంకట సుబ్బారావు 62వ వర్ధంతి సభ శనివారం స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో సీపీఎం మండల కార్యదర్శి నీలపాల సూరిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్ట్ వారసత్వాన్ని నిలబెట్టిన నాయకుడు సుబ్బారావు అన్నారు. ఆనాటి కమ్యూనిస్ట్ వారసత్వాన్ని మనం మరింత ముందుకు తీసుకువెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. చల్లా విశ్వనాథం మాట్లాడుతూ సుబ్బారావు క్విట్ ఇండియా ఉద్యమం పాల్గొనేందుకు ఆరు నెలల జైలుశిక్ష అనుభవించారన్నారు. ఆయన న్యాయవాది పట్టాను రద్దు చేస్తే కోర్టులో వాదించి విజయం సాధించారన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు సిరిపురపు శ్రీనివాస్, కూనిరెడ్డి అప్పన్న, సత్యనారాయణ, యాసలపు రమేష్, రొంగల సుబ్బలక్ష్మి, ఎం.రాంబాబు, వీర్రాజు, డి.క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్లలో సాధారణ బోగీల సంఖ్య పెంచాలి



రైల్వే స్టేషన్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

సామర్లకోట: అన్ని రైళ్లలో సాధారణ బోగీల సంఖ్య పెంచాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. సాధారణ ప్రయాణికులకు రక్షణ కల్పించాలని, బోగీల సంఖ్య పెంచాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు బాలం శ్రీనివాసు మాట్లాడుతూ విశాఖపట్నం, విజయవాడలకు ఉండే పాసింజర్ రైళ్లతో పాటు అనేక రైళ్లను ఎక్స్‌ప్రెస్‌లుగా మార్పు చేశారని ఆరోపించారు. దీని కారణంగా పేద, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఎక్కడానికి సాధారణ బోగీల సంఖ్య తక్కువగా ఉండటంతో ప్రయాణికులు వేలాడుతూ రైళ్లలో ప్రయాణించాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్ బోగీలకు సమానంగా సాధారణ బోగీల సంఖ్యను పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. ధనవంతులు ప్రయాణం చేయడానికి అనేక రైళ్లు ఉన్నాయని, సాధారణ ప్రయాణికులు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ మేరకు స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్‌కు వినతి పత్రం అందజేశారు. సీపీఎం నాయకులు కరణం ప్రసాదరావు, కరణం గోవిందరాజు, బాలం హరిబాబు, ఐటీ వీరబాబు, కె.పవన్, కె.ఏడుకొండలు పాల్గొన్నారు.

ఎన్‌సీసీతో క్రమశిక్షణ



ఎన్‌సీసీ క్యాంపులో ప్రసంగిస్తున్న ఎయిర్ కమాండర్ సైలాని

పెద్దాపురం: ఎన్‌సీసీతో ప్రతి విద్యార్థికి క్రమశిక్షణ అలవడుతుందని ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ అధికారి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఎయిర్ కమాండర్ నర్సింగ్ సైలాని అన్నారు. పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ స్కూల్‌లో ఎన్‌సీసీ క్యాంపును గురువారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎయిర్ కమాండర్ సైలాని మాట్లాడుతూ జీవితంలో ఎదురయ్యే కష్టాల నుంచి బయటపడేసి ఉత్తమ జీవితానికి ఎన్‌సీసీ బాటలు వేస్తుందన్నారు. ఇటువంటి ఆహ్లాదకర వాతావరణంలో ఎన్‌సీసీ క్యాంపునకు అనుమతినిచ్చిన పాఠశాల డైరెక్టర్ విజయ్ ప్రకాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆంధ్ర, తెలంగాణకు సంబంధించిన ఐడీఎస్ఎస్‌సీ టీషర్ట్‌ను ఆయన ఆవిష్కరించి, రైఫిల్ షూటింగ్‌లో ఎంపికైన విద్యార్థులకు కిట్లను అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్ మోహన్ అగర్వాల్, కల్నల్ హెచ్ఎస్ మౌనిక, మేజర్ మహ్మద్ ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలందించండి

పెద్దాపురం: పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలందించాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం గురువారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఉమామహేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందని సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో ఆయన స్పందిస్తూ సత్వరం వైద్యుల నియామకానికి చర్యలు తీసుకుంటానని చినరాజప్ప హామీ ఇచ్చారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబురాజు, ఆసుపత్రి కమిటీ సభ్యుడు వంగలపూడి సతీష్, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి, వైద్యులు మానస, సిద్ధ, విద్య, నరేంద్ర, హెడ్‌నర్సు రమాదేవి పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి



ధర్నా విజయవంతం చేయాలంటూ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తపల్లి: స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం నాయకుడు జి.అప్పారెడ్డి కోరారు. యండపల్లిలో గురువారం విద్యుత్ చార్జీల నిలువు దోపిడీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 5న కొత్తపల్లి విద్యుత్ కార్యాలయం వద్ద జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని అప్పారెడ్డి కోరారు. సమావేశంలో సీపీఎం నాయకులు సాంబశివకుమార్, జీవీఎస్ రెడ్డి, ఎం.సూరిబాబు, లిబరేషన్ నాయకులు జి.సత్యనారాయణ, జి.వినోద్, కె.కమలాకర్ తదితరులు పాల్గొన్నారు

హిందూ ధర్మరక్షణ సమితి సమావేశం

కొత్తపల్లి: స్థానికంగా ప్రకృతి వ్యవసాయ రైతు ఉల్లి సురేష్ స్వగృహం వద్ద గురువారం హిందూ ధర్మరక్షణ సమితి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మండలంలోని 16 గ్రామాల కమిటీల సభ్యులు హాజరయ్యారు. హిందూ ధర్మరక్షణ సమితి అధ్యక్షుడు చేదులూరి గవరయ్య, రామ్‌కిషోర్, అబ్బిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కబేళాపై కథలు చెబుతారేంటి?

- అధికారులను ప్రశ్నించిన కౌన్సిలర్లు
- వాడీవేడిగా మున్సిపల్ సమావేశం



మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్లు దేవ, వెంకటేశ్వరరావు

పిఠాపురం: హైకోర్టు ఆదేశాలపై ఆగిన కబేళాను తిరిగి పునరుద్ధరించడానికి అధికారుల చేస్తున్న ప్రయత్నాలను ప్రజలు అడ్డుకుంటుంటే, వాటిని లెక్క చేయకుండా కబేళా పనులు ప్రారంభించడానికి అజెండాలోకి ఎందుకు తీసుకు వస్తున్నారంటూ పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. గత నెల అజెండాలో ఈ అంశాన్ని పాలకవర్గం తిరస్కరించినా మళ్లీ ఇప్పుడు ఎందుకు తీసుకువచ్చారని. దీనిని వాయిదా వేయాలని కౌన్సిలర్ వజ్రపు శైలజ కమిషనర్ కనకారావును కోరారు. వాయిదా వేయడం కుదరదని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని కమిషనర్ చెప్పడంపై ఆమె తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ గండేపల్లి సూర్యావతి అధ్యక్షతన గురువారం నిర్వహించిన కౌన్సిల్ సాధారణ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు అధికారుల తీరును దుయ్యబట్టారు. కోఆప్షన్ సభ్యుడు గండేపల్లి బాబీ, కౌన్సిలర్ బోనుదేవలు మాట్లాడుతూ గత సమావేశంలో కబేళా పనులపై ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చెబుతూ అజెండాలో వచ్చిన అంశాన్ని వాయిదా వేశారని, దానిపై నెల రోజుల వ్యవధిలో ఏ చర్యలు తీసుకున్నారో చెప్పాలని కమిషనర్‌ను కోరారు. అయితే తాము ఏ చర్యలు తీసుకోలేదని కాని, ఇప్పుడు పనులు మాత్రం పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పర్యవేక్షణలో వారి నిబంధనల మేరకు ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా నిర్మించేలా చూస్తామని చెప్పారు. అయితే అక్కడి ప్రజలు వ్యతిరేకిస్తుంటే వాటికి పరిష్కారం చూపించకుండా ఎలా నిర్మిస్తారంటూ కౌన్సిలర్లు ప్రశ్నించారు. నిర్మాణాల దగ్గరకు ప్రజలు వస్తే వారికి వివరిస్తామని కమిషనర్ చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేసిన కౌన్సిలర్లు ప్రజల తరఫున ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులుగా తాము అడుగుతుంటే సమాధానం చెప్పకుండా ఎప్పుడో ఎక్కడో చెబుతామంటూ తమను అవమానిస్తున్నారంటూ కౌన్సిలర్లు అధికారుల తీరును తప్పుబట్టారు. మున్సిపల్ పరిధిలో కొత్తగా ప్రతిపాదించిన రూ.3 కోట్ల పనుల్లో చాలా మంది కాంట్రాక్టర్లు అతి తక్కువ ధరకు టెండర్లు వేశారని, వాటి వల్ల పనుల్లో నాణ్యత పూర్తిగా దెబ్బతింటుందని కౌన్సిలర్ బోరుదేవ అన్నారు. నాణ్యతా ప్రమాణాల ప్రకారమే పనులు జరిగేలా చూస్తామని అధికారులు సమాధానం చెప్పగా, ఆయా పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తెలియజేస్తూ పూర్తి వివరాలు సమావేశం ముగిసేలోపు కౌన్సిలర్లకు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. అయితే అది కుదరదని మున్సిపల్ డీఈ రాజు చెప్పడంతో మీకు కావాల్సిన పనులు మాత్రం క్షణాల్లో చేయించుకుంటారని, తాము అడిగితే మాత్రం సాధ్యం కాదంటారా అంటూ కౌన్సిలర్ దేవ నిలదీశారు. పిఠాపురం మున్సిపల్ కార్యాలయం సమీపంలో ఉన్న చేపల మార్కెట్‌కు సంబంధించి గతంలో రూ.25 లక్షలు పెట్టి అభివృద్ధి పనులు చేశారని, మళ్లీ ఇప్పుడు రూ.21 లక్షలు పెట్టి అభివృద్ధి చేస్తామంటున్నారని, ముందు చేసిన పనులు ఎందుకు పనికి రాకుండా ఉన్నాయంటూ కౌన్సిలర్ నగేష్ ప్రశ్నించారు. దీనిపై కౌన్సిలర్ తలిశెట్టి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గతంలో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు తీసుకోకపోవడం వల్ల ఆ పనులు నిరుపయోగంగా ఉన్నాయని, దీనికి అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. అక్కడ రెండు దుకాణాలు అడ్డుగా ఉన్నాయని వాటిని తొలగించి వేరోచోటుకు మార్చి అన్ని వ్యాపారాలు సజావుగా జరిగేలా చూడాలని ఆయన సూచించారు. పిఠాపురంలో పారిశుధ్యం మెరుగుపర్చాలని చెబుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం కనీసం వార్డుల్లో చెత్త ఎత్తించలేకపోతున్నామని, ఎన్నిసార్లు విన్నవించినా మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్లు పచ్చిమళ్ల జ్యోతి, కొత్తపల్లి పద్మ తదితరులు పాల్గొన్నారు.

మూలన పెట్టిన ఆటోలకు మరమ్మతులా?

- అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు



గొల్లప్రోలులో కమిషనర్‌ను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

పిఠాపురం: ఎప్పుడో తెచ్చి ఎటువంటి ఉపయోగం లేకుండా మూలన పెట్టిన ఈ– ఆటోలకు మరమ్మతులు ఏంటంటూ పలువురు కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. గొల్లప్రోలు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం చైర్ పర్సన్ గంద్రేటి మంగతాయారు అధ్యక్షతన జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే ఈ– ఆటోల మరమ్మతులకు రూ.5 లక్షలు కేటాయించినట్లు అజెండాలో చూపించడంతో కౌన్సిలర్లు గంటా అప్పలస్వామి, గుళ్ల సుబ్బారావులు మాట్లాడారు. ఏవిధంగానూ ఉపయోగించని ఈ– ఆటోలకు రూ.5 లక్షలు పెట్టి మరమ్మతులు చేయించడమేమిటంటూ ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ కనకారావు మాట్లాడుతూ వాటిని ఇంకా వినియోగంలోకి తీసుకురాలేదని, అయినప్పటికి ఈ– ఆటోలు కావడంతో మరమ్మతులకు గురవుతుంటాయని, అందుకే వాటికి మరమ్మతులు చేయించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఇంకా వాటిపై నిర్ణయం తీసుకోలేదని, అందువల్లే ఆచరణలోకి తీసుకురాలేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గొల్లప్రోలు నగర పంచాయతీ అభివృద్ధికి కేటాయించిన రూ.కోటి నిధులతో చేపట్టే పనులన్నీ కొన్ని వార్డులకే పరిమితం చేశారని, కొన్ని వార్డులు అభివృద్ధి చెందితే చాలా అంటూ పలువురు కౌన్సిలర్లు అధికారులను ప్రశ్నించారు. అజెండాలో పొందుపర్చిన 48 అంశాలను సభ్యులు ఆమోదించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ఆరుగురికి మూడు రోజుల చొప్పున జైలు, ఆరుగురికి రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ కాకినాడ ఐదో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ షేక్ షరీన్ తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. గురువారం కోర్టులో 12 మందిని హాజరుపరచగా వారికి పై విధంగా జైలు, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.